సాక్షి ప్రకాశం

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



మరింత మెరుగ్గా వైద్యసేవలు

గిద్దలూరు, కంభం ప్రభుత్వ వైద్యశాలలను ట్రైబల్ వైద్యశాలలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. అదనపు సౌకర్యాలతో పాటు, వైద్యులను నియమించనున్నారు. - 8లో..



ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కారు ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొని ఐదుగురికి గాయాలయ్యాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా పవిత్రోత్సవం



పవిత్రప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు

సింగరాయకొండ: పాతసింగరాయకొండ శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాత్రి రెండో రోజు అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్ర ప్రతిష్టా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వాములవారి ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులకు పూజలు చేసి హోమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకటలక్ష్మీ నృసింహాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రూ.1.50 లక్షలు పలికిన వినాయక లడ్డు



నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహం

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద 15 కేజీల లడ్డుకు గురువారం వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో గ్రామానికి చెందిన పిక్కిలి ఆదిలక్ష్మి అత్యధికంగా రూ.1.50 లక్షలకు లడ్డు దక్కించుకున్నారు. వినాయక విగ్రహం ఊరేగింపు కార్యక్రమంలో వైభవంగా నిర్వహించారు. విగ్రహ ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా శ్రీనివాసరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ కమిటీ సభ్యుడిగా మల్లిక్

మార్కాపురం: జిల్లా వినియోగదారుల రక్షణ కమిటీ సభ్యునిగా ఓ.ఎ.మల్లిక్‌ను నియమించినట్లు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది సివిల్ సప్లయిస్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు కమిటీ నియామకం చేపట్టారని మల్లిక్ తెలిపారు. కమిటీ తొలి సమావేశం ఈ నెల 30న జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు.

సైబర్ కేటుగాళ్లు

డబ్బు ఆశ.. ఎంతటి విద్యావంతుడికైనా విచక్షణను.. ఆలోచనను దూరం చేస్తోంది. మోసగాళ్ల వలలో చిక్కి విలవిల్లాడేలా చేస్తోంది. ఆఫర్లు, ప్రైజ్ మనీల పేరుతో..కొంత డబ్బు ముందు కడితే అంతకు రెట్టింపు డబ్బులు ఇస్తామంటూ మెసేజ్‌లతో వలవేసి.. ఆనక లక్షలు కాజేసి నట్టేట ముంచేసే సైబర్ కేటుగాళ్లు పొంచి ఉన్నారు. అత్యాశకు పోయి వారి మాటలు నమ్మి నిలువు దోపిడీకి గురయ్యే బాధితులూ నానాటికీ పెరిగిపోతున్నారు. ఎస్పీ స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువగా సైబర్ నేరాలే కావడం దీనికి నిదర్శనం.



- ఆన్‌లైన్ మోసాలతో జేబులు ఖాళీ
- లక్షలు పోగొట్టుకొని తలలు పట్టుకుంటున్న బాధితులు
- అత్యధికంగా విద్యావంతులే బాధితులు
- అత్యాశకు పోతున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు
- కళ్లు మూసి తెరిచే లోపే నిలువు దోపిడీ

ఒంగోలు టౌన్: డబ్బులు చెట్లకు కాయవు అని పెద్దలు చెప్పిన మాటలు నూరుశాతం నిజమని రుజువవుతూనే ఉంది. అయినా కొందరు అత్యాశాపరులు డబ్బులు ఊరికే వస్తున్నాయంటే ఎగబడుతున్నారు. గుడ్డిగా నమ్మి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. రెట్టింపు డబ్బులు వస్తాయని కొందరు, ప్రైజ్‌మనీ వచ్చిందని మరికొందరు ముక్కూముఖం తెలియని వ్యక్తుల చేతుల్లో డబ్బులు పెట్టేసి చేతులు కాల్చుకుంటున్నారు. ఆనక లబోదిబోమని గుండెలు బాదుకుంటున్నారు. ఇటీవల కాలంలో అనేక మంది సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి మోసపోవడం ఎక్కువై పోయింది. రోజురోజుకీ బాధితుల సంఖ్య పెరిగిపోతోంది.

మూడు రోజుల్లో రూ.27 లక్షలు మాయం:
ఒంగోలు శివారుకు చెందిన ఒక యువకుడు బీటెక్ చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. వర్క్ ఫ్రం హోం కావడంతో ఒంగోలులోని తన ఇంటి వద్ద ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. ఒకరోజు అతడి మొబైల్‌కు వచ్చిన మెసేజ్ వచ్చింది. ఇంటి వద్దనే రెట్టింపు డబ్బులు సంపాదించండి అనే ఆ ప్రకటన చూసిన అతడు తొలుత రూ.2 వేలు చెల్లించాడు. దానికి రెట్టింపు డబ్బులు వచ్చాయి. ఇదేదో బాగుందనుకున్న అతడు తిరిగి రూ.4 వేలు కట్టాడు. వెంటనే అతడి ఖాతాలో రూ.8 వేలు పడ్డాయి. ఈ లోపు అతడికి మరో మెసేజ్ వచ్చింది. మా గ్రూపులో చేరి పెద్ద మొత్తంలో డబ్బులు కడితే అంతే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశ పెట్టారు. అంతే అతడు తన వద్ద ఉన్న డబ్బులతో పాటుగా అక్కడా ఇక్కడా తెచ్చి రూ.27 లక్షలు కట్టాడు. అంతే అవతలి వైపు నుంచి ఫోన్ కట్ అయ్యింది. మోసం జరిగిందని అర్థం చేసుకున్న సదరు సాఫ్ట్‌వేర్ ఇంజినీరు వెంటనే పోలీసుల దగ్గరికి పరుగులు తీశాడు. ఇదంతా కేవలం మూడు రోజుల వ్యవధిలోనే జరగడం గమనార్హం.

రెండున్నర కోట్లకు ఆశ పెట్టి...
ఒకటి రెండు కాదు ఏకంగా రెండున్నర కోట్ల రూపాయలతో వల విసిరారు. రూ.70 లక్షల చేప పడింది. ఇది నిజం. ఇటీవల ఒంగోలులో జరిగిన భారీ మోసం ఇది. నగరానికి చెందిన ఒక రియల్టర్‌కు తరచూ ఆన్‌లైన్లో దుస్తులు కొనడం అలవాటు. ఎక్కువగా మీషోలో దుస్తులు కొనగోలు చేసేవాడు. మీషో ప్రైవేటు కంపెనీ లిమిటెడ్ తరఫున మీకు రూ.12.50 లక్షల ప్రైజ్‌మనీకి ఎంపికయ్యారని ఆయనకు మెసేజ్ వచ్చింది. అందుకుగాను రిజిస్ట్రేషన్ ఫీజులు, కేంద్ర పన్నుల నిమిత్తం రూ.50 వేలు చెల్లించాలని కోరడంతో అది నిజమని నమ్మిన ఆయన వెంటనే రూ.50 వేలు చెల్లించాడు. ఆ తరువాత మీ ప్రైజ్‌మనీ రెట్టింపు అయిందని నమ్మించారు. అది హాంకాంగ్ కరెన్సీలో వస్తుంది కనుక మన కరెన్సీలో దాని విలువ రూ.2.68 కోట్లు ఉంటుందని చెప్పారు. రకరకాల పన్నులు, ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పిన మాటలను గుడ్డిగా నమ్మేశాడు. వారు అడిగినప్పుడల్లా డబ్బులు ముట్టచెప్పాడు. అలా రూ.70 లక్షలు కట్టిన తరువాత కానీ ఆయనకు అర్థం కాలేదు తాను మోసపోయానని. కళ్లు తెరిచే సరికి రెండున్నర కోట్ల సంగతి దేవుడెరుగు రూ.70 లక్షలు పోగొట్టుకుని రోడ్డు మీద నిలబడాల్సి వచ్చింది. అప్పుడు పోలీసులు గుర్తుకు వచ్చారు. తనకు న్యాయం చేయమంటూ ఫిర్యాదు చేశాడు.

బ్యాంకు కార్డు పేరిట టోకరా...
మద్దిపాడు మండలానికి చెందిన ఒక వ్యక్తికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు మీ ఐసీఐసీఐ క్రెడిట్ కార్డుకు చార్జీలు పడకుండా ఉండేందుకు తాము పంపించిన లింకును ఓపెన్ చేయాలని కోరారు. అతడి వాట్సాప్‌కు ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు.ఏపీకే పేరుతో యాప్ పంపించారు. తద్వారా అతడి ఫోన్‌ను హ్యాక్ చేశారు. అతడి కార్డు వివరాలను సేకరించారు. ఈ లోపే అతడి ఖాతాలోని రూ.98 వేలు కాజేశారు. ఇలాంటివే మరెన్నో మోసాలు జరుగుతున్నాయి. బీటెక్ చదువుతున్న ఒంగోలుకు చెందిన ఒక విద్యార్థిని రెట్టింపు డబ్బుల ప్రకటనను నమ్మి రూ.6 లక్షలు పోగొట్టుకుంది.

పోలీసులకు తలనొప్పిగా మారుతున్న కేసులు...
ఇప్పుడు పోలీసు స్టేషన్‌కు వచ్చే కేసుల్లో ఎక్కువగా సైబర్ నేరాలకు సంబంధించినవి ఉంటున్నాయి. ఈ కేసులను ఛేదించడం పోలీసులకు తలనొప్పిగా మారుతోంది. సైబర్ నేరగాళ్ల ఫోన్ నంబర్లను ట్రేస్ చేస్తే అవి ఎక్కడో కర్ణాటక, కాశ్మీర్ చిరునామాలతో ఉంటున్నాయి. పర్సనల్ లోన్లు ఇస్తామంటూ కాకినాడ చిరునామాతో వాట్సాప్ కలిగిన మనోహర్ చౌదరి అనే వ్యక్తిపై ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో ఇచ్చిన ఫోన్ నంబర్లను ట్రేస్ చేయగా తప్పుడు చిరునామాలతో కొనసాగుతున్నట్లు తెలిసింది. దాంతో పోలీసులు కూడా చేతులెత్తేశారు.

చదువుకున్నవాళ్లే ఎక్కువ...
ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్న వారిలో ఎక్కువగా చదువుకున్న వారే ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వారిలో కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అత్యధికమంది ఉండడం గమనార్హం. విజయవాడ కేంద్రంగా ఏర్పాటై కోట్లాది రూపాయలను ముంచేసిన ఒక సంస్థలో మోసపోయిన వారిలో కూడా న్యాయవాదులు, వైద్యులు, ఉద్యోగులు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అలాగే ఆన్‌లైన్ బెట్టింగుల్లో డబ్బులు పెట్టి నష్టపోయిన ఒంగోలుకు చెందిన విద్యుత్ శాఖలో పనిచేసే ఒక ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. అలాగే ఆ మధ్య ఆత్మహత్య చేసుకొని మరణించిన ఒక పోలీసు కానిస్టేబుల్ కూడా బెట్టింగుల్లో నష్టపోయినట్లు ప్రచారం జరిగింది.

వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి



ఏదైనా సైబర్ నేరం జరిగినప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం వలన ఉపయోగం ఉంటుంది. దీనివల్ల నేరగాళ్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాను బ్లాక్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఆలస్యమయ్యేకొద్దీ మోసగాళ్లు తప్పించుకునే అవకాశం ఉంది. అయినా డబ్బులు ఎవరికీ ఉచితంగా రావు. శ్రమ పడకుండా లక్షల డబ్బులు సంపాదించడం అనేది కుదరని పని. ఇలాంటి వాటిని నమ్మడం కూడా సరైంది కాదు. గుర్తు తెలియని యాప్‌లను డౌన్లోడ్ చేసుకోవడం ప్రమాదకరం. ప్లేస్టోర్, గూగుల్ నుంచి మాత్రమే యాప్‌లు డౌన్లోడ్ చేసుకోవడం మంచిది. అలాగే ఏదైనా అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించడం కానీ, సమాచారం ఇవ్వడం కానీ చేయాలి. ప్రజలు ఆర్థిక విషయాల్లో అప్రమత్తంగా ఉండాలి. మన చేతిలోని డబ్బులు ఒకసారి మోసగాళ్ల చేతుల్లోకి వెళ్లిన తరువాత తిరిగి మన చేతికి రావడం చాలా కష్టం.

– మలికా గర్గ్, ఎస్పీ

అసమానతలపై జాషువా రచనలు స్ఫూర్తిదాయకం

- గబ్బిలం, పిరదౌశి వంటి రచనలతో ప్రజల్లో చైతన్యం
- గుర్రం జామువా జయంతి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ శ్రీనివాసులు, ఇతర అధికారులు

ఒంగోలు అర్బన్: మహాకవి గుర్రం జాషువా సమాజంలోని అసమానతలపై చేసిన రచనలు ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు అన్నారు. గురువారం ప్రకాశం భవనం ప్రాంగణంలో ఉన్న జాషువా ప్రాంగణంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, గుర్రం జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జాషువా 128వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు, పలు సంఘాల నాయకులు జాషువ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గబ్బిలం, పిరదౌశి వంటి రచనలతో అసమానతలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. ఆయన నిర్దేశించిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. నగర మేయర్ గంగా సుజాత మాట్లాడుతూ జాషువా సమాజంలోని అసమానతలపై చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు, బలహీన వర్గాలు రాజకీయంగా, సామాజికంగా ఎదిగేలా కృషి చేస్తున్నారన్నారు. ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాషువా విగ్రహం ఏర్పాటు కోసం మొత్తం రూ.16.75 లక్షలు వ్యయం అవుతుండగా వాటిలో రూ.5 లక్షలు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కేటాయించినట్లు తెలిపారు. జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాట్లాడుతూ జాషువా జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం శుభపరిణామమన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆమేరకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న జాషువా కాంస్య విగ్రహం, గార్డెనింగ్ పనులు నవంబర్ నాటికి పూర్తి చేసి ఘనంగా ప్రారంభోత్సవం చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి ఉదయశ్రీ, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, జాషువా సమితి సభ్యులు యెండ్లూరి రవికుమార్, కత్తి కళ్యాణ్, మున్నంగి లక్ష్మయ్య, అంగలకుర్తి ప్రసాద్, పాటిబండ్ల ఆనందరావు, దాసరి రవి, రావినూతల కోటి, ముప్పవరపు గోపి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయానికి తీరనున్న నీటి సమస్య

- ఎంపీ మాగుంట చొరవతో రూ.79 లక్షలు మంజూరు చేసిన నవోదయ కమిషనర్
- హర్షం వ్యక్తం చేస్తున్న ఒంగోలు నవోదయ ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో దశాబ్దాలుగా నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి చొరవ తీసుకుని ఇటీవల నవోదయ విద్యాలయ సమితి కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. నీటి సమస్య వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎలా ఇబ్బంది పడుతున్నారు అన్నదానిని వివరించారు. ఇటీవల కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులతో ఈ విషయమై సమీక్షించారు. స్థానిక సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద బోరుబావి, పంపుసెట్ షెడ్డు, చెరువు నుంచి విద్యాలయం వరకు పైపులైను ఏర్పాటు చేసేందుకు రూ.79 లక్షలు అవసరం అవుతాయని ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో నవోదయ విద్యాలయ సమితి నిధులు మంజూరు చేస్తూ లిఖిత పూర్వక ఉత్తర్వులు పంపారు. ఈ నిధులతో పనిని వెంటనే ప్రారంభించి వేగవంతంగా పూర్తిచేసి ఒంగోలు నవోదయ విద్యాలయానికి శాశ్వత మంచినీటి వసతి కల్పిస్తామని ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. సమస్యకు పరిష్కారం చూపిన ఎంపీ మాగుంటకు నవోదయ విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన కార్యకర్త ఉన్మాదం



చించివేసిన ఫ్లెక్సీ

- బాలినేని ఫ్లెక్సీ చించివేత
- కార్పొరేటర్ ఇంటి మీద దాడి
- సీఐతో దురుసు ప్రవర్తన

ఒంగోలు టౌన్: రోజురోజుకీ జనసేన కార్యకర్తలు హద్దు మీరుతున్నారు. ఎమ్మెల్యే బాలినేని ఫ్లెక్సీ చించేసి కార్పొరేటర్ ఇంటి మీదికి దాడికి వెళ్లిన జనసేన కార్యకర్త మీద గురువారం రాత్రి తాలుకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నగరంలోని 50వ డివిజన్‌లో నెహ్రూనగర్‌లో వినాయక చవితిని పురస్కరించుకొని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి రామాలయం సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఈనెల 18న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇది సహించలేని జనసేన, టీడీపీ నాయకులు కలిసి ఫ్లెక్సీ ఏర్పాటు చేయకుండా గొడవకు దిగారు. పూటుగా మద్యం తాగి రచ్చరచ్చ చేశారు. డివిజన్‌లో గొడవలు జరగడం ఇష్టం లేని కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు వారిని సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా ప్రయోజనం లేకపోయేసరికి తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న సీఐ పీ భక్తవత్సలరెడ్డి కూడా వారిని సముదాయించేందుకు ప్రయత్నించగా జనసేన కార్యకర్త బోరబోయిన సాయ సీఐతో దురుసుగా ప్రవర్తించాడు. ఫ్లెక్సీని తీసి పడేయ్ అంటూ రౌడీయిజం చెలాయించాడు. సీఐ మీద తిరగబడి అతిగా ప్రవర్తించాడు. అప్పటికీ సహనం వహించిన పోలీసులు ఇరువర్గాలను ఒప్పించే ప్రయత్నం చేశారు. ప్రశాంతంగా పండుగ జరుపుకునేందుకు సహకరించాలని కోరారు. అనంతరం తిరిగి అక్కడ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. టీడీపీ కార్యకర్తలతో జనసేన కార్యకర్తలు కలిసి మద్యం తాగుతూ పండుగ రోజు గొడవలు సృష్టించేందుకు కుయుక్తులు పన్నారు. అయితే ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనంతో పండుగ నిర్వహించారు. ఇది సహించలేని టీడీపీ, జనసేన కార్యకర్తల సహకారంతో సాయి ఉన్మాదిగా ప్రవర్తించాడు. బుధవారం వినాయక నిమజ్జనం ఊరేగింపునకు బయలుదేరిన తరువాత మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేశాడు. బాలినేనిని దూషిస్తూ ఫ్లెక్సీని కత్తితో కోశాడు. అంతేకాకుండా ప్రసాదరావు ఇంటి వద్దకు వెళ్లి బూతులు తిడుతూ దాడికి ప్రయత్నించాడు. దీంతో గురువారం రాత్రి కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు తాలుకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా సాయి బాలినేని ఫ్లెక్సీని చించివేయడమే కాకుండా పెట్రోలు పోసి తగులబెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

హృదయం పదిలం

యాంత్రిక జీవనం.. మానసిక ఒత్తిడి.. కనీస వ్యాయామం లేకపోవడం.. దురలవాట్లు.. ఆహార నియమాలు పాటించకపోవడం..మనిషి గుండె లయ తప్పేలా చేస్తున్నాయి. చిన్న వయసులోనే హృద్రోగ సమస్యలతో ఆస్పత్రి పాలవుతున్నారు. అప్పటి వరకు ఉత్సాహంగా తిరుగుతూ ఉండే యువత కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృత్యువాత పడుతున్నారు. కనీస జాగ్రత్తలు పాటించడం ద్వారా మీ గుండెను పదిలంగా ఉంచుకోవచ్చని చెబుతున్నారు వైద్యులు. నేడు వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.



- ముందస్తు జాగ్రత్తలతో గుండె ఆరోగ్యం
- షుగర్, కొలెస్ట్రాల్, స్మోకింగ్ వంటి వాటితో జాగ్రత్త
- 40 ఏళ్లు వయసుదాటిన వారు తరచూ గుండె పరీక్షలు చేయించుకోవాలి
- మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో గుండె వ్యాధులకు చెక్
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద 2019 నుంచి జిల్లాలో 22,105 మంది హృద్రోగులకు చికిత్స
- నేడు వరల్డ్ హార్ట్ డే

ఒంగోలు అర్బన్: ఉదయాన్నే కాస్త వాకింగ్..చిన్నపాటి వ్యాయామాలు చేస్తే గుండెకు ఎంతో మంచిదని అందరికీ తెలిసిందే అయినా.. నిర్లక్ష్యంతో ఉదయం వ్యాయామాన్ని ఏరోజుకారోజు వాయిదాలు వేస్తుండటం పరిపాటి. దీంతో వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బులపాలవడం ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాస్త వ్యాయామంతో పాటు మంచి ఆహారపు అలవాట్లతో గుండె జబ్బులకు చెక్ పెట్టవచ్చని కార్డియాలజిస్టులు సూచిస్తున్నారు. శుక్రవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖతో పాటు పలు ప్రైవేటు ఆస్పత్రులు గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీలు, కార్యక్రమాలు చేపడుతున్నాయి. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా మన దేశంలో వయసుతో సంబంధం లేకుండా యువతకు సైతం గుండె జబ్బులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ కాలం నుంచి షుగర్ ఉన్న వాళ్లు, ఫ్యామిలీ హిస్టరీలో గుండె జబ్బులు ఉన్న వాళ్లు, అధిక కొలెస్ట్రాల్, హైపర్‌టెన్షన్ ఉన్న వాళ్లు ఏడాదికి, రెండేళ్లకు గుండెకు సంబంధించిన పరీక్షలు ముందస్తుగా చేయించుకుని తగిన జాగ్రత్తలు పాటిస్తే హృద్రోగాలకు దూరంగా ఉండవచ్చు. మిగిలిన వాళ్లు కూడా 40 ఏళ్ల వయసు నుంచి ముందస్తుగా గుండె పరీక్షలు చేయించుకుని గుండె జబ్బులను గుర్తిస్తే సకాలంలో వైద్య సేవలు పొంది రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మరణించే వారిలో సగంపైన మరణాలు హార్ట్ ఎటాక్, బ్రెయిన్‌స్ట్రోక్, పెరాలసిస్‌లతో జరుగుతున్నాయి. క్యాన్సర్ మరణాలతో పోలిస్తే ఈ తరహా మరణాలు ఎక్కువనే చెప్పాలి. గుండె జబ్బుల గురించి ముందస్తుగా తెలుసుకోవడం ద్వారా నివారించుకునేందుకు ఎంతో అవకాశం ఉంటుంది. తగిన ఆరోగ్య సూత్రాలు పాటించడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండటం వంటి వాటితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం, వైద్య సలహాలు తీసుకోవడం వలన గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రతి ఒక్కరూ బేసిక్ సీపీఆర్‌పై అవగాహన పెంచుకుంటూ ఆపద సమయంలో ఎవరు ఎవరికైనా సీపీఆర్ చేసి ప్రాణాలు నిలపవచ్చు. వీటితో పాటు కాలుష్య నివారణ, మొక్కలు నాటడం వంటి సామాజిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములైతే మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందితే గుండె జబ్బుల నుంచి రక్షణ పొందవచ్చు.

జిల్లాలో ఏడాది వ్యవధిలో చిన్నవయసులోనే గుండెపోటుతో చనిపోయిన వారిలో కొందరు..

- దర్శి మండలం దేవవరం గ్రామ సర్పంచ్‌గా ఉన్న జొన్నలగడ్డ సుసన్న (40) గుండెపోటుతో ఈనెల 24వ తేదీ మృతిచెందారు.
- కంభంకు చెందిన కె.సుబ్బారావు (32) అనే యువకుడు గుండెపోటుతో ఈ ఏడాది జూన్ 16వ తేదీ మృతిచెందాడు.
- టంగుటూరు మండలం జయవరానికి చెందిన బి.రాజేష్ (31) అనే యువకుడు గత ఏడాది డిసెంబర్ 15వ తేదీ గుండెపోటుతో మృతిచెందాడు.

హృద్రోగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
హృద్రోగ సమస్యలతో బాధపడుతూ చికిత్స చేయించుకోలేని వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్‌లు ఉచితంగా చేయిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2019 నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు జిల్లాలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 22,105 మందికి గుండె వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు పూర్తి ఉచితంగా చేశారు. దీనికి గాను రూ.91.09 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది.

సకాలంలో స్పందించడం ఎంతో ముఖ్యం



హార్ట్ ఎటాక్స్, ఇతర గుండె జబ్బులకు సంబంధించి ఏదైనా సమస్యలు వస్తే వెంటనే స్పందించి వైద్యులను సంప్రదించి తగిన వైద్యం తీసుకుంటే ప్రాణాలను కాపాడుకోవచ్చు. నిర్లక్ష్యం చేసి రోజులపాటు వేచి చూసి ఇబ్బంది ఎక్కువైన తర్వాత డాక్టర్లను సంప్రదించినా నష్టం జరగవచ్చు. దురలవాట్లను దూరం చేసుకుని క్రమం తప్పని వ్యాయామంతో గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చు. అవగాహన ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా ఉండటం ముఖ్యం.

– డాక్టర్ వి.సెంథిల్ కుమార్, కార్డియాలజిస్ట్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్

అపోహలకు దూరంగా ఉండాలి



దురలవాట్లు ఉన్న వాళ్లు ఒక సిగరెట్‌కు ఏమీ కాదని, ఒక పెగ్ మందు తాగితే గుండెకు మంచిదని, ఈ వయసులో మనకేమీ కాదులే అనే అపోహలకు దూరంగా ఉండాలి. గుండె జబ్బులకు సంబంధించి సమయం ఎంతో ముఖ్యమైనది. సరైన సమయంలో వైద్యులను సంప్రదిస్తే గుండె జబ్బుల నుంచి ప్రాణాలను నిలుపుకోవచ్చు. మంచి ఆహారపు అలవాట్లతో పాటు ఉదయం కొద్దిపాటి వ్యాయామం చేస్తే గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

– డాక్టర్ కేశవ, అమృత హార్ట్ హాస్పిటల్

కుటుంబ సభ్యులకు వివాహిత అప్పగింత

తుని: భర్తతో గొడవ పడి రైలులో తుని రైల్వేస్టేషన్‌కు వచ్చిన వివాహితను ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. చీరాలకు చెందిన కొండ్రు కీర్తి తన భర్త స్టాలిన్‌తో గొడవ పడి రైలులో తుని రైల్వేస్టేషన్‌కు వచ్చింది. అక్కడ రెండో ప్లాట్ ఫాంపై కూర్చుని ఏడుస్తుండగా విధి నిర్వహణలో ఉన్న జీఆర్పీ కానిస్టేబుళ్లు డి.సూర్యప్రకాష్, ఆదినారాయణ ఆమెను ప్రశ్నించారు. సమాచారం సేకరించిన పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఆహారం అందించి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్నారు. ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ కీర్తి తల్లి ఉమాదేవికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సాయంత్రం తుని వచ్చిన కుటుంబ సభ్యులకు కీర్తిని క్షేమంగా అప్పగించారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా ప్రకాశం క్రికెట్ లీగ్ పోటీలు


బహుమతి అందిస్తున్న కోఆప్షన్ సభ్యుడు అమీరుల్లాఖాన్

మార్కాపురం: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకాశం క్రికెట్ లీగ్ పోటీలు 5వ రోజు గురువారం ఉత్సాహంగా సాగాయి. స్థానిక ఎస్వీకేపీ కళాశాల మైదానంలో గురువారం మొత్తం 4 మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటగా బీబీ11 వర్సెస్ కోటి జట్ల మధ్య పోటీ జరిగింది. బీబీ 11 టీమ్ 7 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేయగా, కోటి జట్టు 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 91 పరుగులు చేసి గెలిచింది. రెండో మ్యాచ్‌లో ఎస్టేట్ 11 టీమ్, చింతగుంట్ల జట్లు తలపడ్డాయి. ఎస్టేట్ 11 జట్టు పది ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేయగా, చింతగుంట్ల టీమ్ ఐదు వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసింది. దీంతో ఎస్టేట్ 11 టీమ్ 8 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో ఆసీఫ్ యూత్ 11, ఇందిరమ్మ కాలనీ జట్లు తలపడగా ఆసీఫ్ యూత్ 65 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోయింది. ఇందిరమ్మ కాలనీ జట్టు 8.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేయడంతో విజేతగా నిలిచింది. నాలుగో మ్యాచ్‌లో టిస్త్‌వార్డు లెవెన్స్, రంగా 11 జట్లు పోటీపడగా టిస్త్‌వార్డు లెవెన్స్ 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. రంగా లెవెన్స్ 9.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. దీంతో 28 పరుగుల ఆధిక్యంతో టిస్త్‌వార్డు లెవెన్స్ జట్టు విజయం సాధించింది.

ఆటో బోల్తా.. 10 మంది కూలీలకు గాయాలు


కోటమ్మను ఒంగోలుకు తరలిస్తున్న బంధువులు

కొండపి(సింగరాయకొండ): పొగాకు కూలీలతో వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో 10 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం సాయంత్రం కొండపి మండలం మిట్టపాలెం, పెరిదేపి గ్రామాల మధ్య చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలకు తీవ్ర గ్రాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కొండపి పంచాయతీలోని ముక్కోడిపాలెం కాలనీ వాసులు చోడవరంలో పొగనారు మడుల్లో పనికి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ఘటన సంభవించింది. క్షతగాత్రులను కొండపి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. తీవ్రంగా గాయపడిన కోటమ్మ, అంజమ్మను మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.


కంభం ప్రభుత్వ వైద్యశాల


నాడు-నేడు పథకంలో నిర్మాణం పూర్తి చేసుకున్న అదనపు గదులు

మరింత మెరుగ్గా వైద్య సేవలు

- గిద్దలూరు, కంభం ప్రభుత్వ వైద్యశాలలకు 'ట్రైబల్' గుర్తింపు
- ఇప్పటికే నాడు–నేడులో రూ.3 కోట్లతో కంభం వైద్యశాల అభివృద్ధి
- ట్రైబల్ వైద్యశాలగా గుర్తించడంతో మెరుగవనున్న సేవలు
- ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు వైద్యశాలల సిబ్బంది కృతజ్ఞతలు

కంభం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. నాడు-నేడు కార్యక్రమాన్ని పాఠశాలలతోపాటు ఆస్పత్రుల్లోనూ అమలు చేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టడంతో సరికొత్త రూపు సంతరించుకుంటున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పిస్తుండటంతో కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా తయారవుతున్నాయి. నాడు-నేడు కింద రూ.3 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్న కంభం ప్రభుత్వ వైద్యశాల ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు కృషితో ట్రైబల్ హాస్పిటల్‌గా గుర్తింపు పొందింది. గిద్దలూరు కమ్యూనిటీ వైద్యశాలలోనూ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. కంభంతోపాటు గిద్దలూరు సీహెచ్‌సీని కూడా ట్రైబల్ ఆస్పత్రిగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలకు సేవలు మరింత మెరుగవనున్నాయి.

అధునాతనంగా కంభం ఆస్పత్రి

గతంలో 30 పడకలతో ఉన్న కంభం ప్రభుత్వ వైద్యశాలను 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో వైద్యశాలలో అదనపు గదులు, ల్యాబ్‌లు, స్త్రీ, పురుషులకు ప్రత్యేక వార్డులు, సిబ్బందికి గదులు, ఇతర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉండటంతో ప్రజలకు నాణ్యమైన, మెరుగైన సేవలు త్వరలో అందనున్నాయి.

ట్రైబల్ గుర్తింపుతో అదనపు నిధులు

వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేయడం కోసం జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం 8 నెలల క్రితం జిల్లాలోని పెద్దదోర్నాల, యరగొండపాలెం, మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలను ట్రైబల్ జాబితాలో చేర్చింది. దీంతో వైద్యులు, సిబ్బందికి వేతనం పెరుగుతుంది. ఈ ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించేందుకు వైద్యులు, సిబ్బంది ఆసక్తిని కనబరుస్తారు. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతాయి. వైద్యశాల అభివృద్ధి, సామగ్రి కొనుగోలు, ఇతర అవసరాలకు ప్రత్యేక నిధులు మంజూరవుతాయి. మార్కాపురం, యరగొండపాలెం, దోర్నాల ఆస్పత్రులకు ట్రైబల్ గుర్తింపు ఇచ్చిన నేపథ్యంలో గిద్దలూరు, కంభం వైద్యశాలలను ఆ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోపాటు వైద్యశాఖ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈనెల 23న రెండు వైద్యశాలలకు ట్రైబల్ గుర్తింపునిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.


వైద్యశాలలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా(ఫైల్)

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కృషి వల్లే వైద్యశాలకు ట్రైబల్ వైద్యశాలగా గుర్తింపు లభించింది. వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగిన సమయంలో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా ముఖ్యమంత్రితో మాట్లాడి ట్రైబల్ వైద్యశాలగా గుర్తింపు వచ్చేందుకు కృషి చేశారు. వైద్యశాల సిబ్బంది తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నా.

– డా.శివనాయక్, సూపరింటెండెంట్, కంభం ప్రభుత్వ వైద్యశాల

నేడు వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడత నిధులు విడుదల

- జిల్లాలో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 10,741
- గత ఏడాదికంటే ఈ ఏడాది 103 మంది అధికం
- ఆటో/టాక్సీ/మ్యాక్సీక్యాబ్/ఎండీయూ యజమానులకు రూ.10 వేల సాయం
- విజయవాడలో నేడు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఒంగోలు: ఒక వైపు కుటుంబ పోషణ, మరో వైపు వాహన బీమా, రిపేర్లు తదితరాలకు అయ్యే వ్యయం వెరసి సగటు వాహనదారుని జీవితం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ నేపథ్యంలో బీమా లేకుండా వాహనాలు నడపడం, ఏదైనా అనుకోని దురదృష్టకర ఘటన జరిగినపుడు బీమా, వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడం లాంటి కారణాలతో వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని గమనించి ప్రజా సంకల్ప యాత్రలో వాహనమిత్ర పథకం ద్వారా ఆదుకుంటానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే ఏటా రూ.10 వేల చొప్పున వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

ఈ ఏడాది లబ్ధిదారులు 10741 మంది

ఈ ఏడాది వాహనమిత్ర పథకం లబ్ధిదారుల సంఖ్య జిల్లాలో 10,741గా నిర్ధారించారు. 2019-20లో 12,406 మంది, 2020-21లో 15,130 మంది, 2021-22లో 13,695 మంది, 2022-23లో 10,103 మంది లబ్ధిపొందారు. ప్రస్తుతం 2023-24లో 10,741 మందికి అర్హులుగా గుర్తించారు. గత ఏడాదికంటే 103 మంది అధికంగా ప్రయోజనం పొందుతున్నారు. ఈ ఏడాది లబ్ధిదారులకు విడుదల చేస్తున్న నిధులు రూ.10.74 కోట్లు కాగా ఈ మొత్తాన్ని వాహనాల బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, వాహన మరమ్మతులు, ఇతర అవసరాల కోసం వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్పందన భవన్‌లో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా స్థానిక రవాణాశాఖ అధికారులు మినీ స్టేడియం వద్ద నుంచి లబ్ధిదారులతో ర్యాలీగా ప్రకాశం భవనం వరకు ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

మండలాల వారీగా లబ్ధిదారులు

మండలం	లబ్ధిదారుల సంఖ్య	మండలం	లబ్ధిదారుల సంఖ్య
ఒంగోలు	1918	తర్లుపాడు	180
కొండపి	137	పొన్నలూరు	97
కొత్తపట్నం	325	పుల్లలచెరువు	144
టంగుటూరు	256	చీమకుర్తి	100
మద్దిపాడు	407	కొనకనమిట్ల	248
జరుగుమల్లి	149	మార్కాపురం	935
బేస్తవారిపేట	282	త్రిపురాంతకం	185
దోర్నాల	174	పెద్దారవీడు	266
కొమరోలు	134	కంభం	302
సీఎస్‌పురం	118	రాచర్ల	148
హనుమంతునిపాడు	144	గిద్దలూరు	216
కనిగిరి	325	దర్శి	312
వెలిగండ్ల	76	మర్రిపూడి	185
పామూరు	237	ముండ్లమూరు	176
సంతనూతలపాడు	226	దొనకొండ	234
అర్థవీడు	141	పీసీపల్లి	101
నాగులుప్పలపాడు	386	కురిచేడు	153
వై.పాలెం	228	పొదిలి	361
సింగరాయకొండ	318	తాళ్లూరు	180

రాయితీపై గుండె పరీక్షలు

- ఆస్టర్ రమేష్ ఆస్పత్రి వైద్యుల వెల్లడి
- వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నెల రోజులపాటు..


రాయితీపై అందించే గుండె వైద్య పరీక్షల పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఒంగోలు అర్బన్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు సారథ్యంలో అన్ని వయసుల వారికి వీలైనంత ఎక్కువ రాయితీతో గుండె పరీక్షలు చేసేలా ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబర్ 29వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం హాస్పిటల్లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రజలందరికీ వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గుండె పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రత్యేక ప్యాకేజీని నెలరోజులపాటు అందిస్తున్నామన్నారు. ఐఎంఏ వైద్యులంతా గుండె పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గుండె జబ్బుల నుంచి రక్షణ పొందాలని కోరారు. కార్డియాక్ హెల్త్ ప్యాకేజీ కింద రూ.8200 విలువైన పరీక్షలు కేవలం రూ.2500, కరోనరీ యాంజియోగ్రామ్ ప్యాకేజీ కింద రూ.18 వేల విలువైన పరీక్షలను రూ.9 వేలు, సీటీ కరోనరీ యాంజియోగ్రామ్ ప్యాకేజీ కింద రూ.13 వేలు ఉండే పరీక్షలను రూ.7 వేలకు అందుబాటులో ఉంటాయని వివరించారు. హాస్పిటల్ సీఓఓ హరికుమార్‌రెడ్డి, కార్డియాలజిస్ట్ డాక్టర్ సెంథిల్‌కుమార్, ఇతర డాక్టర్లు మణిబాబు, రంగనాథ్, వంశీకృష్ణ, నాగమోని, మధు, ఐఎంఏ ప్రెసిడెంట్ మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు పరిష్కారం కాదు

చీరాల రూరల్: ద్విచక్ర వాహనంపై దేశం మొత్తం పర్యటించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించేందుకు యువకుడు కృషి చేయడం చిన్న విషయం కాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పర్యటించి గురువారం రాత్రి చీరాల గడియార స్తంభం సెంటర్‌కు చేరుకున్న నెల్లూరుకు చెందిన టీ వెంకట కార్తీక్‌ను పట్టణానికి పలువురు ప్రముఖులు పూలమాలలు, శాలువాలువేసి ఘనంగా సత్కరించారు. భారీగా బాణా సంచాలు కాల్చి వెంకట కార్తీక్ వెన్నుతట్టి తమవంతు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకట కార్తీక్ మాట్లాడుతూ సమాజంలో నేటి యువత చిన్నచిన్న విషయాలకే ఆత్మహత్యలు చేసుకుని తనువు చాలిస్తున్నారని అటువంటి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకు తాను దేశం మొత్తం పర్యటిస్తున్నట్లు చెప్పారు. తన పర్యటన 14 ఫిబ్రవరి 2022 నెల్లూరులో ప్రారంభించినట్లు చెప్పారు. రెండు రోజుల్లో తన యాత్ర పూర్తవుతుందని, యాత్ర పూర్తయిన వెంటనే గిన్నిస్ బుక్ ఆఫ్ వర ల్డ్ రికార్డు కోసం పేరు నమోదు చేయించుకోనున్నట్లు చెప్పారు. 580 రోజుల్లో 135 వేల కిలో మీటర్లు యాత్ర పూర్తిచేసినట్లు చెప్పారు. తాను చేస్తున్న ఈ యాత్రలో ఆర్థికంగా ఎవరి సహకారం తీసుకోలేదని, తన తండ్రి సహకారంతోనే యాత్ర పూర్తి చేసినట్లు చెప్పారు.


వెంకట కార్తీక్‌ను సన్మానిస్తున్న పట్టణ ప్రముఖులు

ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు


ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న పోలీసులు


క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

- ఐదుగురికి గాయాలు

సింగరాయకొండ: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలు కాగా కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. గురువారం మండల పరిధిలో జాతీయరహదారిపై పోలేరమ్మ గుడి సమీపంలో విమానాల రన్‌వే పై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిత్తూరుకు చెందిన జీవన్‌కుమార్, సుకన్య దంపతులు తమ బంధువులతో కలిసి సింహాచలం నరసింహస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో వస్తుండగా కారు కలికవాయ ఫ్లైఓవర్ దాటి పోలేరమ్మ గుడి సమీపంలోకి రాగానే రోడ్డు మధ్యలో వెళ్తున్న ఇసుక ట్రాక్టరు ట్రక్కు వెనకభాగాన్ని బలంగా ఢీ కొట్టింది. కారు డ్రైవింగ్ చేస్తున్న జీవన్‌కుమార్ అతని భార్య సుకన్యకు తీవ్ర గాయాలు కాగా.. కారులో ఉన్న వెంకటేష్, మల్లిఖార్జున, నీరజలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా మెరుగైన వైద్య కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి. శ్రీరామ్‌లు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై వివరించారు. ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా, టంగుటూరు హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం ఖోఖో జట్ల ఎంపిక నేడు

కనిగిరి రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖోఖో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కర్‌రావు, బి.కాశీ విశ్వనాథరెడ్డి గురువారం తెలిపారు. అక్టోబర్ 20 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు జిల్లా యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్లను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. బాలుర జట్టును శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పంగులూరులోని ఎమ్మెస్సార్ అండ్ బీఎస్‌ఎం జూనియర్ కాలేజీలో, బాలికల జట్టును కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల బరువు, ఎత్తు, వయసు మొత్తం 250 పాయింట్లలోపు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9848219080ను సంప్రదించాలని సూచించారు.